
ఉత్సాహంగా భోగి సంబరాలు


ఆత్మకూరులో వేసిన భోగి మంట


ఆత్మకూరురూరల్: మహిమలూరులో భోగి మంట వేస్తున్న యువతులు


సంగం: భోగి మంటల వద్ద సందడి చేస్తున్న యువత

- ఊరూరా వేడుకలు
- పోటాపోటీగా భోగి మంటలు వేసిన యువత
- సంక్రాంతికి సిద్ధమైన ప్రజలు
- ఇంటింటా పిండివంటల ఘుమఘుమలు

మూడు రోజుల సంక్రాంతి వేడుకల్లో తొలి రోజు శనివారం భోగి పండగను ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. యువత గ్రామాలు పట్టణాల్లో పోటాపోటీగా ఇళ్ల ముంగిట్లో భోగి మంటలు వేశారు. యువతులు వేసిన రంగవల్లులతో ఇంటి ముంగిళ్లు కనువిందు చేశాయి. ప్రతి ఇంట్లో పండగకు తయారు చేసిన పిండివంటల ఘుమఘుమలు నోరూరించాయి. ప్రతి ఒక్కరూ ఉదయాన్నే అభ్యంగన స్నానాలు ఆచరించి కొత్త దుస్తులు ధరించి తమ ఇళ్లలో ఇష్టదైవానికి పూజలు నిర్వహించారు. ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఆత్మకూరు: తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి పండగలో భాగంగా తొలి రోజు శనివారం భోగి పండగను ప్రజలు భోగి మంటలు వేసి ఉత్సాహంగా జరుపుకున్నారు. యువకులు, చిన్నారులు తమ ఇళ్ల ముందు తెల్లవారుజామునే తాటి ఆకులు, కట్టెలు, పాత సామగ్రితో భోగి మంటలు వేశారు. అనంతరం తలంటు స్నానాలు చేసి నూతన దుస్తులు ధరించి భోగి పండగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర ఆలయంలో, శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో, కాశీనాయన ఆశ్రమంలో భక్తులు పూజలు నిర్వహించారు. దూర ప్రాంతాల్లో ఉండే కుటుంబసభ్యులు, బంధువుల రాకతో ఇళ్లల్లో సందడి నెలకొంది.

పండగ సంప్రదాయాలు ప్రారంభం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజలు శనివారం భోగి పండగను ఉత్సాహంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే యువతీ, యువకులు తమ ఇళ్ల ముందు భోగి మంటలు వేసి పండగ సంప్రదాయాలను ప్రారంభించారు. మహిళలు ఇంటి ముంగిట కళాపిచల్లి, ముగ్గులు పెట్టి పండగ సందర్భంగా తమ ఇళ్లకు వచ్చిన యాచకులకు ప్రత్యేక పిండి వంటలను పంపిణీ చేశారు. గ్రామాల్లోని ఆలయాల్లో పండగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు తల్లి దండ్రులు భోగిపండ్లు పోశారు. మహిమలూరులో రక్షణశాఖ సలహాదారు సతీష్‌రెడ్డి – పద్మావతి దంపతులు, వారి కుమార్తె స్నిగ్ధ, అఖిల్ తదితరులతో కలిసి భోగి వేడుకల్లో పాల్గొన్నారు.

వేకువనే భోగి మంటలు

మర్రిపాడు: మండలంలో శనివారం భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేకువ జామునే మహిళలు, యువకులు, చిన్నారులు భోగి మంటలు వేశారు. భోగి మంటల్లో నీళ్లు కాచుకుని అభ్యంగన స్నానాలు ఆచరించారు. చిన్నారులు కొత్త దుస్తులు ధరించి సందడి చేశారు. సుదూర ప్రాంతాల నుంచి బంధుమిత్రులంతా పల్లెలకు చేరుకోవడంతో సందడిగా మారింది. ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు చెప్పుకుంటూ భోగి పండగను ఆనందంగా జరుపుకున్నారు.

గ్రామాల్లో సందడి

ఉదయగిరి: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం భోగి పండగను ప్రజలు ఆనందంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా వేకువజామునే లేచి ఇంటి ముందు పెద్ద ఎత్తున భోగి మంటలు వేసి సంక్రాంతి పండగకు స్వాగతం పలికారు. భోగి మంటపైనే నీళ్లు కాచుకుని స్నానాలు చేసి కొత్త దుస్తులు ధరించారు. ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఇంటి ముంగిట రంగవల్లులు వేశారు. పండగ సందర్భంగా గ్రామాలకు కుటుంబసభ్యులు, బంధువుల రాకతో కుటుంబాల్లో సంతోషాలు కనిపించాయి.


ఇంటి ముంగిట్లో అందంగా ముగ్గు వేస్తున్న మహిళ

ప్రతి ముంగిటా..

సంగం: మండలంలో భోగి పండగను శనివారం ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ముంగిటా తెల్లవారుజాము నుంచే భోగి మంటలు వేశారు. తాటి ఆకులు, మొద్దులు, పాత సామాన్లు భోగి మంటల్లో వేశారు. యువత ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ సందడి చేశారు.

అగ్నిని ఆరాధిస్తూ..

సోమశిల: భోగి పర్వదినాన్ని శనివారం అనంతసాగరం మండలంలో ఘనంగా నిర్వహించారు. వేకువజామునే అగ్నిని ఆరాధిస్తూ భోగి మంటలు వేసి సంబరాలు జరుపుకున్నారు. దూర ప్రాంతాల్లో ఉండేవారు వారి స్వగ్రామాలకు చేరుకుని ఈ వేడుకల్లో పాల్గొన్నారు. మండలంలోని రేవూరులో యువకులు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు.

వాడవాడలా..

వరికుంటపాడు: మండలంలో శనివారం భోగి పండగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. వేకువజామునే లేచి ఇళ్ల ముంగిట భోగి మంటలు వేశారు. ఉదయాన్నే స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని గ్రామాల్లోని ఆలయాల్లోకి వెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు. మహిళలు ఇళ్ల ముంగిట రంగవల్లులు తీర్చిదిద్దారు. చిన్నారులకు భోగి పండ్లు వేడుకగా పోశారు. వలసవాసులు పండగకు స్వగ్రామాలకు రావడంతో జనాలతో పల్లెలు కళ కళలాడుతున్నాయి.

ఎగిసిన భోగి మంటలు

కొండాపురం: మండలంలో శనివారం భోగి పండగను ప్రజలు సంతోషంగా జరుపుకున్నారు. తాటాకులు, రేగికంప తదితర సామగ్రితో పోటీపడి ఉవ్వెత్తున ఎగిసిపడేలా భోగి మంటలు వేశారు. ఉదయాన్నే కొత్త బట్టలు ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొమ్మి, సాయిపేట, కొండాపురం, తూర్పుఎర్రబల్లి, గరిమెనపెంట పంచాయతీల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.


వరికుంటపాడులో ఇంటి ముంగిళ్లలో వేసిన భోగి మంటలు


సోమశిల: రేవూరులో..

క్రీడలు మానసిక ఉల్లాసానికి ముఖ్యం

- రక్షణశాఖ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి

మర్రిపాడు: క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని రక్షణశాఖ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి అన్నారు. మండలంలోని చుంచులూరు గ్రామంలో జరుగుతున్న క్రీడా పోటీలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి సందర్భంగా క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల నిర్వాహణకు కృషి చేసిన సుబ్బరాజును ఆయన అభినందించారు. చిన్నతనం నుంచి క్రమశిక్షణతో చదువుకుంటే భవిష్యత్ బాగుంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గంగవరపు శ్రీనివాసులునాయుడు, కన్నపరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి, సిద్దంరెడ్డి మోహన్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, బీజేపీ నాయకుడు సుబ్బరాజు, మాజీ సర్పంచ్ యలగాల వెంకటేశ్వర్లు, యల్లంరాజు మోహన్‌రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రక్షణశాఖ సలహాదారు సతీష్‌రెడ్డి

విజేతలకు బహుమతులు

సంగం: స్థానిక ఎంజీఆర్ బ్యారేజ్ పక్కనే ఉన్న శ్రీరామచంద్రాపురం కాలనీలో శనివారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ చెంచురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్నాటి రవీంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ముగ్గులు వేస్తున్న మహిళలు

సర్పంచ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు

ఆత్మకూరు: మండలంలోని అప్పారావుపాళెం సర్పంచ్ కుమారి తనను కొందరు వ్యక్తులు కులం పేరుతో దూషించి అవమాన పరిచారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.శివశంకర్‌రావు శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన జెడ్పీటీసీ సభ్యురాలు, ఆమె భర్తతోపాటు మరికొందరు గిరిజన మహిళా సర్పంచ్‌నైన తనను అకారణంగా దూషిస్తున్నారని, అంతేకాకుండా పంచాయతీ సమావేశంలో కొన్ని పత్రాలపై తన వద్ద సంతకాలు చేయించుకున్నారని ఆమె ఆరోపించినట్లు ఎస్సై తెలిపారు. దీంతో కేసు నమోదు చేశామన్నారు.

గంజాయి పట్టివేత

అల్లూరు: మండలంలోని ఇస్కపల్లి పాళెం గ్రామంలో ఓ ఇంట్లో 400 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు శనివారం కోవూరు ఎస్ఈబీ సీఐ నరహరి రావు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇస్కపల్లి పాళెం గ్రామంలో ప్రళమకావేరి తాతయ్య(77) అనే వ్యక్తి ఇంట్లో గంజాయి ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా అతని వద్ద 400 గ్రాముల గంజాయి, గంజాయిని తాగే పరికరం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అతనిపై కేసు నమోదు చేశామన్నారు. బాపట్ల జిల్లాలోని రైల్వేస్టేషన్‌లో ఒక సాధువు వద్ద రూ.4 వేలు వెచ్చించి 500 గ్రాముల గంజాయిని కొనుగోలు చేసినట్లు నిందితుడు తెలిపాడన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఈబీ ఎస్సైలు టి.శ్రీనివాసులు, డి.శ్రీధర్ పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత గ్రంథాలపై ప్రచారం

ఉదయగిరి: భోగి, సంక్రాంతి పర్వదినాల విశిష్టతలను వివరిస్తూ త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక దుత్తలూరు కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మొబైల్ వాహనం ద్వారా బుక్‌స్టాల్ ఏర్పాటు చేసి త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వర రాసిన వందలాది త్రైతసిద్ధాంత గ్రంథాలను ప్రదర్శించి ప్రచారం చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు, సభ్యులు జి.ప్రసాద్, కె.నరసింహులు, జి.పెంచలరత్నం తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

మర్రిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్థానికుడు గంగవరపు రామానాయుడు, ఉపాధ్యాయుడు మందాడి నరసింహులునాయుడు జ్ఞాపకార్థం క్రీడా పోటీలు నిర్వహించారు. సర్పంచ్ బీబీజాన్ ఈ పోటీలను ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, షటిల్, షార్ట్ పుట్ పోటీలతోపాటు మహిళలకు ముగ్గుల పోటీలు, కుర్చీలాటలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చెన్నపనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమల మాధవరెడ్డి, నాగిరెడ్డి, కొండలరావు, శ్రీనివాసులునాయుడు, మూలి వెంగయ్య, పుల్లయ్యనాయుడు, ఉపాధ్యాయులు ప్రసాద్, నాయబ్ పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో..

ఆత్మకూరు: సంక్రాంతి సెలవులను యువత సద్వినియోగం చేసుకొనేలా యువతకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడాపోటీల నిర్వాహకులు తెలిపారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జక్కా వెంకయ్య ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి శనివారం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. పట్టణానికి చెందిన డాక్టర్ జె.ప్రణీత్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. డీవైఎఫ్ఐ నాయకులు నందా శ్రీనివాసులు, కె.డేవిడ్‌రాజు, ఎ.హజరత్తయ్య, జిలానీ, జీవన్, రిచర్డ్, జయకుమార్ పాల్గొన్నారు.


ఆత్మకూరు: క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

కృష్ణారెడ్డిపల్లిలో..

ఉదయగిరి: మండలంలోని బండగానిపల్లె పంచాయతీ కృష్ణారెడ్డిపల్లిలో సంక్రాంతి సందర్భంగా శనివారం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు, రైతుసంఘం నాయకుడు కాకు వెంకటయ్య ఈ పోటీలను ప్రారంభించారు. దేవసాని శ్రీనివాసులురెడ్డి, రాజారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కాకు కృష్ణ, నాయబ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్

చేజర్ల: మండలంలోని గొల్లపల్లి మైదానంలో ఎంజీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతోంది. శనివారం చేజర్ల కండ్రిక, బోడిపాడు జట్లు తలపడ్డాయి. మధ్యాహ్నం చేజర్ల–బి జట్టు, పుట్టుపల్లి జట్టు తలపడ్డాయి. సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు.


మర్రిపాడు: క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ బీబీజాన్

వైఎస్ జగనన్న క్రికెట్ పోటీలు

కావలిరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న వైఎస్ జగనన్న క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా కొనసాగుతోంది. తుమ్మలపెంట రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో జరుగుతున్న ఈ పోటీల్లో శనివారం మొదటి మ్యాచ్‌లో అమ్మ లెవెన్స్ – డాక్టర్ ప్రవీణ్ లెవెన్స్ జట్లు తలపడగా డాక్టర్ ప్రవీణ్ లెవెన్స్ జట్టు విజయం సాధించింది. శివ సతీష్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

క్లుప్తంగా

సంక్రాంతిని సంతోషంగా జరుపుకుందాం

- ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



ఆత్మకూరు: తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన పెద్ద పండగ సంక్రాంతిని సంతోషంగా జరుపుకుందామని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతికి పెద్ద స్థానమే ఉందని బంధుమిత్రులతో కలిసి సంతోషంగా విందు వేడుకలు చేసుకుంటూ సంక్రాంతి పండగను జరుపుకోవడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. రైతుల లోగిళ్లు పాడి పంటలతో వర్థిల్లాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట ఎస్సైగా నరేష్ శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ఆత్మకూరులో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ అనంతరం నెల్లూరు బాలాజీనగర్‌కు బదిలీ అయ్యారు. అక్కడి నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ఏఎస్‌పేటకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సుభానీని వీఆర్‌కు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై మాట్లాడుతూ సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించినా, జూదం ఆడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత


నగదు అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు

ఆత్మకూరు: పట్టణంలోని హిల్ రోడ్డు కాలనీ వద్ద నివసిస్తున్న అల్లాభక్షు క్యాన్సర్ వ్యాధికి గురికావడంతో మంచానపడ్డాడు. దీంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల యూనియన్ ద్వారా రూ.10 వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల యూనియన్ తరఫున ఈ ఆర్థిక ఆర్థికసాయాన్ని అల్లాభక్షు కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఖాదర్‌వలి, రఘు, మస్తాన్, వలంటీర్ సైదుల్లా పాల్గొన్నారు.

భోగి వేడుకల్లో బీఎంఆర్


గంగిరెద్దులతో సరదాగా రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

అల్లూరు: మండలంలోని తమ స్వగ్రామం ఇస్కపల్లిలో రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు శనివారం భోగి వేడుకల్లో పాల్గొన్నారు. తెల్లవారుజామున భోగి మంట వేశారు. అనంతరం ఇస్కపల్లిలోని గంగమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయాలు, శివాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గులు, క్రీడల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఆయన వెంట ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, ఎంపీపీ శశిరేఖ, ఏఎంసీ వైస్ చైర్మన్ ఊటు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ రంజిత్, నాయకులు బీద రమేష్, దేవరాళ్ల సుబ్రహ్మణ్యం, పంచాయతీ కాపులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరాలపై దాడులు

సీతారామపురం: మండలంలోని అయ్యవారిపల్లి ఎస్సీకాలనీ సమీపంలో కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 5 కోడి పుంజులు, 6 బైక్‌లు, రూ.3,350 నగదు స్వాధీనం చేసుకోవడంతోపాటు 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై కిషోర్‌బాబు తెలిపారు.

ఇద్దరి అరెస్ట్

వింజమూరు: వింజమూరులో శనివారం ఇద్దరు కోడిపందెంరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్సై జంపానికుమార్ తెలిపారు. వింజమూరు మోటుచింతలపాళెం సబ్‌స్టేషన్ పక్కన కోడి పందెం నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారంతో దాడి చేసి ఇద్దరు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అలాగే వారి నుంచి ఒక కోడిపుంజు, రూ.8,500 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

జీఓ నంబర్ 1కు నిరసన

ఆత్మకూరు: పట్టణంలోని బీఎస్సార్ సెంటర్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శనివారం వివిధ ప్రజాసంఘాలు జీఓ నంబరు 1కు నిరసన వ్యక్తం చేశారు. జీఓ నంబర్–1 ప్రతులను దగ్ధం చేశారు. ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు జీఓను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

సతీష్‌రెడ్డికి చిత్రరాజం అందజేత



ఆత్మకూరురూరల్: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన మహేష్ ఆర్ట్స్ అధినేత తుపాకుల రామాంజనేయరెడ్డి తమ బృందంతో కలిసి చిత్రించిన రక్షణశాఖ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి చిత్రరాజంను మహిమలూరులోని ఆయన నివాసంలో శనివారం కలిసి అందజేశారు. సేవ్ గర్ల్ చైల్డ్ ప్రోగ్రాంలో భాగంగా స్త్రీ సమాజాభివృద్ధికి తమ సంస్థ ఎన్నో చైతన్యవంతమైన కార్యక్రమాలు నిర్వహిస్తోందని, తమ సంకల్పానికి సహకారం కోరుతూ ప్రముఖుల ప్రత్యేక చిత్రాలు రూపొందించి వారికి అందజేస్తున్నామని తెలిపారు. వారు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను తెలుసుకున్న సతీష్‌రెడ్డి అభినందించారు.